అధ్వానం.. అపరిశుభ్రం


మారుతీనగర్‌లో రోడ్డుపై పారుతున్న మురికినీరు


గంగాస్థాన్‌లోని రహదారిపై నిలిచిన వర్షపు నీరు

- నగరశివారు కాలనీల్లో అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ
- రోడ్లపై పారుతున్న మురుగునీరు
- ఇబ్బందుల్లో స్థానికులు

నిజామాబాద్ రూరల్: నగర మున్సిపల్ పరిధిలోని శివారు ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు పలు ప్రాంతాల్లోని రోడ్లపై వర్షపునీరు నిలిచింది. అలాగే డ్రెయినేజీలు నిండిపోయి మురుగునీరు రోడ్లపై పారడంతో పరిసరాలు కంపుకొడుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా, అధికారులెవరూ పట్టించుకోవడం లేదు.

ఇదీ పరిస్థితి..

జిల్లా కేంద్రంలోని గంగాస్థాన్ ఫేజ్-1, ఫేజ్-2 మారుతీ నగర్‌లో మురికికాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. వర్షాలు కురిస్తే ఆయా కాలనీల్లో వర్షపు నీరు రహదారులపై నిలిచిఉంటుంది. మారుతీనగర్‌లో మురికి కాలువ నుంచి నీరంతా రోడ్లపై పారుతోంది. దీంతో రోడ్లపై వాహనదారులు, స్థానికులు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై నీరు నిలిచి ఉండటంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతోపాటు, దోమలు విజృంభిస్తున్నాయి. ఈక్రమంలో తాము అనారోగ్యానికి గురవుతున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు పట్టించుకోకపోవడంపై కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీల్లో సమస్యలతో సతమతమవుతున్నా అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఆయా కాలనీల్లో సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి..

అధికారుల నిర్లక్ష్యంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలోని రోడ్లపై మురుగునీరు ప్రవహించడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలి.

–నర్సయ్య, మారుతీనగర్

అనన్య కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: నగరంలోని ఆనంద్‌నగర్‌లో అనన్య అనే చిన్నారి ఇటీవల మురుగుకాల్వలో పడి మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని శనివారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పరామర్శించారు. ఘటనా స్థలాన్ని స్థానికులతో కలిసి పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయంతోపాటు నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనన్య మృతి ఘటనకు మున్సిపల్ అధికారులే కారణమని విమర్శించారు. నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో డ్రెయినేజీలు, రోడ్లు, నాలా కబ్జాలు, సంబంధిత సమస్యలపై దృష్టి పెట్టాలని అధికారులకు గతంలోనే సూచించానని తెలిపారు. అయినా ఇప్పటివరకూ పూర్తిస్థాయిలో పనులు జరగకపోవడంపై మండిపడ్డారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని నగర సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్పొరేటర్లు వెల్డింగ్ నారాయణ, సాధు సాయివర్ధన్, నాయకులు ప్రభాకర్, మఠం పవన్, ఆనంద్, చిరంజీవి, అంబదాస్ రావు, హరీష్, వెంకటరమణ, కోడూరు నాగరాజు పాల్గొన్నారు.

నష్టపరిహారం అందించాలి

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో ఇటీవల నాలాలో పడి మృతిచెందిన అనన్య కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్‌గుప్తా కోరారు. ఈమేరకు ఆయన శనివారం కలెక్టర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. అదేవిధంగా పార్టీ నాయకులు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, మున్సిపల్ కమిషనర్ మకరందుకు వినతిపత్రాలు అందజేశారు. నాయకులు సిర్ప రాజు, ఎనగందుల మురళి, సత్య ప్రకాష్, కార్పొరేటర్ విక్రమ్‌గౌడ్, పోల నారాయణ ఉన్నారు.

ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలకు అందిస్తాం


బోర్గాం(కె)లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

మాక్లూర్: ప్రభుత్వ అందించే ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలకు అందించి, వారి రుణం తీర్చుకుంటానని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని అమ్రాద్, బోర్గాం(కె) గ్రామాలలో ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శనివారం ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా బోర్గాం(కె)లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. తనకు ఇద్దరు ప్రత్యర్థులు ఎన్నికల్లో గట్టి పోటీనిచ్చిన నేపథ్యంలో కూడా నియోజకవర్గ ప్రజలు తనపై నమ్మకం ఉంచి ఓట్లు వేసి గెలిపించిన విషయాన్ని ప్రస్తావించారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని చెప్పారు. ప్రభుత్వం అందించే ఎలాంటి సక్షేమ పథకం అయిన అర్హులకు అందకపోతే తన దృష్టికి తేవాలన్నారు. ఎంపీడీవో క్రాంతి, తహసీల్దార్ శేఖర్, ప్రత్యేకాధికారి ముత్తెన్న, గంగోనే సంతోష్, రామావత్ సురేష్‌నాయక్, అనిల్‌కుమార్, సత్యం, ఒడ్డేన్న, సుబ్బారావు, వినోద్, శివలాల్, ప్రవీణ్‌రెడ్డి, రాజేశ్వర్, ముప్పా గంగారెడ్డి పాల్గొన్నారు.

'ఎల్ఆర్‌ఎస్ హెల్ప్‌డెస్క్' ఏర్పాటు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఆర్‌ఎస్ 2020పై హెల్ప్‌డెస్క్ ఏ ర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్‌రాజు శ నివారం తెలిపారు. అలాగే ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో ఎల్ఆర్‌ఎస్ దరఖాస్తుల ప్రాసెసింగ్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. దరఖాస్తు చే సుకున్న వారు ఏమైన సమస్యలు ఉంటే టౌన్ ప్లానింగ్ అధికారి అంజనేయులు 98481 69830, సూపర్‌వైజర్ వెంకటేష్(హెల్ప్‌డెస్క్ ఇన్‌చార్జి)6301707191, ఆపరేటర్ ప్రభాకర్ 8801805775కు సంప్రదించాలన్నారు.

ప్రత్యేక బస్సు నడపాలి

నవీపేట: మండలంలోని మారుమూల గ్రామ మైన నందిగామకు ప్రత్యేక ఆర్టీసీ బస్సును వేయాలని గ్రామస్తులు కోరారు. ఈమేరకు వారు శనివారం ఆర్టీసీ డిపో-2 సూపరింటెండెంట్ శ్రీలతకు వినతి పత్రం సమర్పించారు.

తాగునీటి సౌకర్యం కల్పించండి

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని 19వ వార్డులో తాగునీటి ఎద్దడితో వార్డు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే తాగునీటి వసతి కల్పించాలని వార్డు కౌన్సిలర్, బీఆర్‌ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బెంజర్ గంగారాం కోరారు. శనివారం జాయింట్ కలెక్టర్ కిరణ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. గంగారాం మాట్లాడుతూ.. వార్డులో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కమిషనర్‌తో పాటు డీఈ, ఏఈలకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. అలాగే బల్దియా పరిధిలో పారిశుద్ధ్యం సమస్యలు నెలకొన్నాయని, అధికారులు స్పందించి బల్దియా సమస్యలను పరిష్కరించాలని కోరారు.

సమాచారం..

నేడు గన్యాతండాలో వైద్యశిబిరం

డిచ్‌పల్లి(జక్రాన్‌పల్లి): జక్రాన్‌పల్లి మండలం గన్యాతండా ప్రైమరీ స్కూల్ ఆవరణలో ఆదివారం గుండెవ్యాధి నిపుణులు అజ్మీర ప్రకాష్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. అజ్మీర లక్ష్మీశైలజ, అజ్మీర దీప్తినాయక్, మల్లారెడ్డి నారాయణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ (హైదరాబాద్) వైద్యులు ఈ శిబిరంలో వైద్య సేవలందించనున్నారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు శిబిరం కొనసాగనున్నట్లు అజ్మీర ప్రకాష్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కమలాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఓపెన్ స్టడీ సెంటర్ ద్వారా ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హెచ్‌ఎం అమర్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యలో చదువు ఆపేసినవారు, వయోజనులందరూ అర్హులన్నారు. ఆసక్తిగలవారు దరఖాస్తులు అందజేసి ప్రవేశాలు పొందాలన్నారు. ఆగస్టు 8 నుంచి సెప్టెంబర్ 30 వరకు ఫీజు చెల్లించవచ్చని, రూ.200 అపరాధ రుసుముతో అక్టోబర్ 1నుంచి అక్టోబర్ 31వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందన్నారు. వివరాలకు 8686140150ను సంప్రదించాలన్నారు.

రేపు కృష్ణాష్టమి మహోత్సవం



నిజామాబాద్‌నాగారం: నగరంలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవం నిర్వహించనున్నట్లు ఇస్కాన్ కంఠేశ్వర్ ఇందూరు అధ్యక్షుడు రమానంద రయాగౌర అన్నారు. నగరంలోని ప్రెస్ క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడారు. వినాయక్ నగర్‌లోని విజయలక్ష్మి గార్డెన్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. అలాగే ఇస్కాన్ కేంద్రంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అలాగే భక్తులకు అన్నదానం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఆదివారం కూడా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాలకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు. సభ్యులు నీతాయ్ చంద్‌నర ఈశ్వర్, రమణ గోపీషా దాసు, సాయిలు ప్రభుజీ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి



ఇందల్వాయి: మండలంలోని మేఘ్యానాయక్ తండాలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని తండావాసులు కోరారు. ఈమేరకు శనివారం వారు గన్నారం సబ్ స్టేషన్ వద్ద నిరసన చేపట్టారు. తండాలో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. ఎస్సై మనోజ్ ఘటన స్థలా నికి వచ్చి, అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

బడుల్లో కృష్ణాష్టమి వేడుకలు


నగరంలో గోపిక, రాధాకృష్ణుల వేషధారణలో నృత్యం చేస్తున్న విద్యార్థులు


సిరికొండ మండలంలో..

నిజామాబాద్ రూరల్/నిజామాబాద్‌అర్బన్/సిరికొండ: నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లోని పలు ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల్లో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థినీవిద్యార్థులు గోపిక, రాధాకృష్ణుల వేషధారణలో అలరించారు. అలాగే సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. పలు పాఠశాలల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, విద్యార్థులతో ఉట్టి కొట్టె కార్యక్రమం నిర్వహించారు.


మాధవనగర్‌లో గోపిక, రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు

మహాసభలను జయప్రదం చేయాలి



నిజామాబాద్ రూరల్: హైదరాబాద్‌లో ఈనె 31 నుంచి సెప్టెంబర్ 2 వరకు నిర్వహించనున్న పీవోడబ్ల్యూ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షురాలు ఆకుల అరుణ కోరారు. నగరంలో కోటగల్లి నీలం రామచంద్రయ్య భవన్ లో శనివారం ఆమె మాట్లాడారు. మహాసభలో మహిళా ఉద్యమ కర్తవ్యాలను, భవిష్యత్ కార్యచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. అనంతరం మహాసభల పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. సంఘ ప్రతినిధులు నీలం లక్ష్మి, గొంట్యాల సంజన, స్వప్న, అనంత, రేఖ, రాజేశ్వరి, దేవిక పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాల అందజేత



జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు శనివారం గోర్తి ఈశ్వర్ ట్రస్ట్ ద్వారా రూ.5వేల నగదు ప్రోత్సాహాన్ని ఎంపీ అర్వింద్ అందజేశారు. ఎంపీ మాట్లాడుతూ.. విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ట్రస్టు వ్యవస్థాపకులు ఉషాబాల పవన్ కృషి అభినందనీయమని అన్నారు. ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, హెచ్‌ఎం లింగం, నాయకులు పల్లె గంగారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు



మోపాల్(నిజామాబాద్‌రూరల్): ఉపాధ్యాయులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, ఏమైనా ఫిర్యాదులు వస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని నిజామాబాద్ ఎంఈవో సేవులా హెచ్చరించారు. మండలంలోని సిర్‌పూర్ ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థుల్లో సామర్థ్యాలను తెలుసుకుని సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలన్నారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచాలని సూచించారు. హెచ్‌ఎం నాగమణి, ఉపాధ్యాయులు అనురాధ, రాము ఉన్నారు.

నిధులు విడుదల చేయాలి

వర్ని: మండలంలో సమస్యల పరిష్కారానికి నిధులు విడుదల చేయాలని మండల కాంగ్రెస్ నాయకులు కోరారు. ఇటీవల ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుగా ప్రభుత్వం నియమించడంతో చందూరు మండల కాంగ్రెస్ నాయకులు శనివారం బాన్సువాడలో పోచారంను కలిసి సన్మానించారు. అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వాలన్నారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)		
		డ్రెస్స్‌డ్	160
		లైవ్	100
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	74,100	వెండి (కిలో)	88,900
22 క్యారెట్స్	68,357		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	16	30	గాజరుగడ్డ	35	50
బెండకాయ	15	30	పచ్చిమిర్చి	20	40
బీరకాయ	30	60	దోసకాయ	20	40
దొండకాయ	25	50	ఆలుగడ్డ	30	50
బీర్నిసకాయ	50	70	గోబిగడ్డ	35	50
కాకరకాయ	40	60	గోబిపువ్వు	35	50
వంకాయ	30	50	బీట్‌రూట్	30	50
పాలకూర	40	60	కరివేపాకు	40	60
మెంతికూర	50	80	చామగడ్డ	50	70
కొత్తిమీర	40	60	గోరుచిక్కుడు	35	50
పుదీనా	70	90	చిక్కుడుకాయ	35	50
క్యాప్సికం	50	70			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-1: ఆయ్ (తెలుగు) - 10.20, 4.20, 10.30 తంగలాన్ (తెలుగు) 1.20, 7.20
- స్క్రీన్-2: డిమోంటి కాలనీ-2 (తెలుగు) - 10.25, 10.20, స్త్రీట్-2 (హిందీ) - 1.30, కమిటీ కుర్రోళ్లు (తెలుగు)-4.30 మారుతీ నగర్ సుబ్రహ్మణ్యం - 7.30
- స్క్రీన్-3: స్త్రీట్-2 (హిందీ) - 10.20, 10.20, మారుతీనగర్ సుబ్రహ్మణ్యం (తెలుగు) - 1.20, డిమోంటి కాలనీ-2 (తెలుగు) - 4.20, డబుల్ ఇస్మార్ట్ (తెలుగు) 7.10

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1: స్త్రీట్-2 (హిందీ) -10.00, 4.30, 10.50, కమిటీ కుర్రోళ్లు (తెలుగు) - 1.15, 7.45
- స్క్రీన్-2: ఏలియన్ రోములస్ (తెలుగు) - 10.15, ఆయ్ - 1.00, తంగలాన్ - 4.05, స్త్రీట్-2 (హిందీ) - 7.25, మారుతీనగర్ సుబ్రహ్మణ్యం - 10.40
- స్క్రీన్-3: డిమోంటి కాలనీ-2 (తెలుగు) - 10.20, 4.40, 10.30, స్త్రీట్-2 (హిందీ) - 1.25, ఏలియన్ రోములస్ (ఇంగ్లీష్) - 7.45
- స్క్రీన్-4: వెడింగ్ డైరీస్ (తెలుగు)-10.55, మారుతీ నగర్ సుబ్రహ్మణ్యం (తెలుగు) - 1.35, 7.40, రేవు (తెలుగు)-4.45, ఇంద్ర (తెలుగు) - 10.50

దేవి	తంగలాన్ (తెలుగు)
నటరాజ్	కమిటీ కుర్రోళ్లు (తెలుగు)
విజయ్	మిస్టర్ బచ్చన్ (తెలుగు)
లలితామహల్	డబుల్‌ఇస్మార్ట్ (తెలుగు)

క్లుప్తంగా

నాసిరకం మద్యాన్ని అరికట్టాలి



సిరికొండ: గ్రామాల్లోని బెల్టు దుకాణాల్లో నాసిరకం, కల్తీ మద్యం విక్రయాలను అరికట్టాలని మాస్‌లైన్ డివిజన్ సహాయ కార్యదర్శి రమేష్ కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్యం వ్యాపారులు సిండికేట్‌గా మారి, గ్రామాల్లో బెల్టు దుకాణాలను కైవసం చేసుకొని మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నారని వాపోయారు. నాసిరకం మద్యం విక్రయాలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దామోదర్, సాయారెడ్డి, రమేష్, ఆశిష్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి



సిరికొండ: అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని మైలారం గ్రామానికి చెందిన మొటాడిరెడ్డి సంఘ నాయకులు కోరారు. మండలంలోని మైలారం గ్రామానికి చెందిన మొటాడి రెడ్డి సంఘం సభ్యులు శనివారం ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను జిల్లా కేంద్రంలో కలిశారు. సంఘం ఆధ్వర్యంలో నిర్మించనున్న ఫంక్షన్‌హాల్‌కు నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం ఎంపీని వారు సన్మానించారు. నాయకులు రంజిత్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, వినోద్‌రెడ్డి ఉన్నారు.

పాఠశాలలో దంత వైద్యశిబిరం



నిజామాబాద్ రూరల్: మండలంలోని సారంగాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. దంతవైద్యులు విద్యార్థులు దంత వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. వైద్యులు అదిత్య రాజ్, సాహితి, వైష్ణవి, పల్లవి, శ్రీమాన్, వసీదుద్దీన్, అనూష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో ఈసీసీఈ డే



ఇందల్వాయి: నల్లవెల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఈసీసీఈ(ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్) డే కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ సునీత మాట్లాడుతూ.. అంగన్‌వాడీల్లో ప్రవేశపెట్టిన ప్రీస్కూల్ విద్యావిధానం గురించి అవగాహన కల్పించారు. టీచర్లు మంజుల, వసంత, కళ్యాణి, పంచాయతీ కార్యదర్శి లావణ్య ఉన్నారు.

కోతుల బెడదను నివారించాలి



ఇందల్వాయి: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ కళాశాలలో కోతుల బెడదని నివారించాలని కళాశాల ప్రిన్సిపల్ పద్మజ కోరారు. ఈమేరకు శనివారం ఆమె ఎఫ్ఆర్వో రవి మోహన్ భట్‌కి వినతిపత్రం అందించారు. కోతులు కళాశాల ప్రాంగణంలోకి చొరబడి బట్టలు, వంట సామగ్రిని ధ్వంసం చేస్తున్నాయన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎఫ్ఆర్వో పేర్కొన్నారు.

బీసీ హాస్టల్స్‌లో సౌకర్యాలు కల్పించాలి

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని బీసీ బాలబాలికల హాస్టల్స్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నాయకులు కోరారు. ఈమేరకు వారు శనివారం జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి స్రవంతికి వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్, నాయకులు నసీర్, సంతోష్, శన్ను వర్మ, నికిత, దివ్యరాణి ఉన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు అందించాలి

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం వెంటనే పాఠ్యపుస్తకాలు అందజేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం రెండోరోజు మిర్చి కాంపౌండ్‌లోని బీసీ హాస్టల్ నుంచి ఎస్ఎఫ్ఐ సమరభేరి మోటార్ సైకిల్ యాత్ర ప్రారంభించారు. జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. జిల్లా అధ్యక్షురాలు దీపిక, సభ్యులు శివ, దినేష్, బాపురావు, నాయకులు కార్తీక్, వరదరాజు, జీషన్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

దాశరథికి ఘన నివాళి



సిరికొండ: మండల కేంద్రంలోని సత్యశోధక్ పాఠశాలలో సాహితివేత్త దాశరథి రంగాచార్య జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. దాశరథి చిత్ర పటానికి ప్రిన్సిపాల్ నర్సయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అక్రమ కట్టదాలపై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్ అర్బన్: నగరంలోని అక్రమ కట్టడాలపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకుడు కైసర్ కోరారు. గత కొనేళ్లుగా నగరంలోని చెరువులు, నాలలు, రోడ్లులు సైతం ఆక్రమణలకు గురయ్యాయన్నారు. వెంటనే అధికారులు స్పందించాలన్నారు.

ఆర్‌వోఆర్‌ను స్వాగతిస్తున్నాం

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త రెవెన్యూ చట్టం రికార్డ్స్ ఆఫ్ రైట్స్(ఆర్‌వోఆర్)ను స్వాగతిస్తున్నట్లు రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిక్ అన్సారి ఒక ప్రకటనలో తెలిపారు. భూ లావాదేవీల కోసం నూతన చట్టం ఎంతో పని చేస్తుందన్నారు. ధరణి వెబ్ పోర్టల్‌ను భూమాత పోర్టల్‌తో అనుసందానం చేయడం ద్వార అనేక సమస్యలు తొలగిపోతయన్నారు.

ఐటీహబ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ధర్నా

నిజామాబాద్‌అర్బన్: నగరంలో ఐటీ హబ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు శనివారం ధర్నా చేపట్టారు. ఐటీహబ్ ప్రారంభం నుంచి ఉద్యోగంలో కొనసాగుతున్నామని, తమను కొత్త ఏజెన్సీ వారు వెళ్లిపోవాలని ఆదేశించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగం లేకుంటే తాము ఎలా జీవించాలంటూ వాపోయారు. అధికారులు స్పందించి తమను ఉద్యోగంలో కొనసాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగులు ప్రకాష్, కనకమ్మ, సురేష్ ఉన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని సిర్‌పూర్ ఉన్నత పాఠశాలలో శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ యువశక్తి, హైదరాబాద్ సంస్కృతి సంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటుపుస్తకాలు, చాక్లెట్లు పంపిణీ చేశారు. హెచ్‌ఎం సత్యనారాయణ, సంస్థ అధ్యక్షులు వెంకటేశ్, మద్దుకూరి సాయిబాబు, ఆకాశ్ పాల్గొన్నారు.



పోలీసుల భారీ బందోబస్తు

బాల్కొండ: ఆర్మూర్‌లో ధర్నాకు రైతుం సంఘాలు పిలుపునివ్వడంతో శనివారం బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ప్రధాన కూడలీల వద్ద ఎలాంటి రాస్తారోకోలు చేయకుండ బందోబస్తు నిర్వహించారు. ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి బందోబస్తును పర్యవేక్షించారు.